సంగీత రూపకం

# జ్యోతిరైక్యము

(గౌతమబుద్ధుని జీవితపు ఉత్తరార్థంలోని సంఘటనలతో)

బాలాంత్రపు రజనీకాంతరావు

బృందగానము.

స్త్రీలు హింసాయుతము సంసారమిది
అశాశ్వతామిహికా పథం
సంసార బంధములేని శ్రమణులు
సాగునదె స్వేచ్ఛా పథం
తరుణులకు సంతరణ మార్గము
తెరువవో కరుణానిధీ

పురు వలిపములు త్యజియించి జేగురు
వల్కలముల ధరింతురో
కఠిన నిష్ఠుర నియమములతో
కాననముల వసింతురో
లలనలకు సన్యాస మెటు
లవలంబ నీయము సోదరీ ...

స్త్రీలు రోసి సంసారబంధము
తలమోసెదము అష్టాంగ మార్గము
వలపు వంతలులేని బ్రదుకుల
నిలిపెదము భూతల స్వర్గము
శాంతి దాంతులె మా నగలు
నిర్వాణకాంతులె పూలమాలలు

పురు నడకచే నలిగిన పదాలు
వంతచే వడకు వాతెరలు
బడలినది గురువరుని పాలక జనని
వాకిట వేచియున్నది
తడియు చెక్కుల పౌరనారీ జనము
పరిజన మొదిగియున్నది
పడయరో సంతరణ మార్గము
పడతులింక దయానిధీ

ప్రజాపతి ఆనందా, నీవైనా భగవాన్‌కి ఒకసారి చెప్పిచూడు నాయనా

ఆనంద మహారాణి ప్రజాపతి మాటను భగవాన్ కాదన రను కుంటాను... సెలవియ్యండి...

ప్రజా ఆనందా, నారీ జానానికికూడా ధర్మపథము దయచేయ మని, సంసార జీవితంనుంచి విముక్తి హృదయశాంతీ కలిగించమని ప్రార్థించాము ఈ ప్రార్థన మానండని స్వామి శాసించారు మాగతి ఏమికాను నాయనా

ఆనం అమ్మా, అదివారి మనోనిశ్చయమై, ఆజ్ఞ అయినప్పుడు మనం ఏమి చేయగలం?

ప్రజా ఇదిన్యాయమేనా? జీవకోటికంతకు సర్వసమాన దృష్టి శాసించిన స్వామికి నారీజనాన్ని పరిహరించడం ధర్మ మేనంటావా ఆనందా ...? ఆ దయానిధి యీ విష యమై తీవ్ర జిజ్ఞాస చేయలేదు నిత్యమూ అంతేవాసి వైన నీవే ఆయనకు ఇదినచ్చజెప్పగలవు

ఆనం అమ్మా మీరుచెప్పనది సమంజసమే అని నాకు తోస్తోంది నేను వారిని అడుగుతాను ఇప్పుడే వెళ్లి అడుగుతాను

పరిక్రమణ సంగీతం

బుద్ధు ఆనందా... శాకూర్చొ తీవ్రమైన ధర్మసందేహమేదో తీర్చుకొందుకు వచ్చావు .

అనం అవును గురుదేవా ...

బుద్ధ అడుగు నాయనా ...

ఆనం మాతృదేవి మహారాణి ప్రజాపతి, దేవి యశోధర, ఇతర కపిలవస్తు మహిళలూ ప్రాచీరంలో వేచి వున్నారు పాదాలు వాచి, విషాదంతో ముఖాలు బరువెక్కి అణచుకోలేని ఆవేదనతో అడుగుతున్నారు మీరు నారీలోకానికి సంసారమునుండి విముక్తి ప్రసాదింపమని అన్నారట భగవన్, వారికోసం నేనుతిరిగి ప్రార్థిస్తున్నాను వారి విన్నపం ఆలింపండి ...

బుద్ధ చాలు ఆనందా .. ఆ విషయ మడుగవద్దు ..

ఆనం భగవన్ .. మీ ఆజ్ఞ అనుల్లంఘనీయమే, అయినా అవినయమని భావింపకపోతే అదే విషయం గురించి చనువు తీసికొని ఇంకొక విధంగా అడుగుతున్నాను మీరు కరుణాసముద్రులు .. కారణంలేకుండా యీ సమస్యను ఆలోచించనిదే త్రోసిపుచ్చరు

బుద్ధ నీ వన్నది నిజం ఆనందా

ఆనం జీవకారుణ్యాము, భూతదయ, సర్వమానవ సమానత బోధించిన సద్గురువులు, తోడిమానవలోకానికి ఐహిక బాధావిముక్తి కలిగించు ధర్మపథాన్ని ప్రసాదించిన వారు, ఈ మార్గం పురుషులకు మాత్రమే అని నిర్దేశించి సహజీవనులైన స్త్రీలను విడువడం న్యాయమేనా భగవన్ ...

బుద్ధ ఆనందా ... అదిస్థూలదృష్టిలో అన్యాయమే కాని, బహుదూర పర్యవసాన మాలోచించితే నీవలాగనవు...

ఆనం ఒకటి సెలవియ్యండి భగవన్ ... స్త్రీలు సంసారదూరులై ప్రవ్రజ్యావ్రతంసాగిస్తే జన్మరాహిత్యానికి ఒక్క సోపానం సమీపానికైనా రారంటారా? ఆశాపాశావ్యథా విదూరులైతే నారీమణులు యోగినిత్వాని కర్హత పొందరా

బుద్ధ అవును నాయనా ... అదిసాధ్యమే ...

ఆనం మానవోత్తములైన మిమ్మల్ని కన్న మహారాణి మాయాదేవి, ఆమెతరువాత స్వీయస్తన్యమిచ్చి మిమ్మల్ని సాకిన మహారాణి ప్రజాపతి మనధర్మానికెంత మహోపకారిణులో యోచించండి భగవన్ ... సాధ్యమైతే వారికి మనసంఘ ప్రవేశంద్వారా సంసార దుఃఖప్రశాంతి లభిస్తే దానికి తమసమ్మతి దయచేయడం ధర్మమే కాదా ...

బుద్ధ సమ్మతింపక తీరదా నందా ... .. సమ్మతిస్తున్నాను సంఘప్రవేశానికి పురుషులకు నిర్ణయించిన అష్టాంగ సూత్రములేకాక స్త్రీలకు మరి ఎనమిది నిష్ఠుర నియమాలను విధిస్తున్నాను వాటినికూడా వారు పాలిస్తే వారికి సంఘప్రవేశం కలిగించవచ్చు ...

ఆనం మహాప్రసాదం

పరిక్రమణ సంగీతం

ఆనం స్వాగతంబమ్మ సుస్వాగతంబమ్మ
స్వామి మీ కోరికను మన్నించిరమ్మ
సంసార దుఃఖాబ్ధి హింసచాలింక
సంఘ ప్రవేశమే శరణు మీ కింక ...

స్త్రీలు ఆనంద నీవల్ల నానందమాయె
నారి జగతికెల్ల నవ జన్మమాయె
సర్వ సమదర్శియౌ శాక్యర్షి కరుణ
నర నారులకు సంఘ శరణమ్ము దొరకె ...

స్త్రీపురుష బృందగానం
అదె మా ఆనందం అదెమా ఆనందం
మాపై పగ గలవారంటే పగ పూనము మేము
పగపూనినవారికి చిరునగవున హృదయమ్మిత్తుము...అదె
ఆమయ భరిత జగాన
నిరామయ జీవుల మేము
శ్రాంతాలసజగతిని
సేవా విక్రాంతుల మేము . అదె
ఆశా తృషిత ధరాతలి
అతి నిర్లిప్తుల మేము
తాపత్రయ పరుల నడుమ
స్వాతంత్ర్య యోగులము మేము
సమదర్శి తథాగతుండూ
భువి చూపెన స్వర్గం

మనుజావళి కందరకూ
మోక్షప్రద మార్గం
అదె మా ఆనందం
అదె మా ఆనందం

. .... .

ఆనం భగవన్, సోదరీమణుల ఆనందానికి మేరలేదు తమ అంగీకారానికి వారెంతో కృతజ్ఞురాండ్రు సామాన్యాష్టాంగ సూత్రాలనేకాక ప్రత్యేకాష్టాంగ విధులను వారు కఠోర నియమాలతో పాటిస్తున్నారు

బుద్ధ భవతు కాని ఆనందా ... జరుగరానిదే జరిగిపోయింది దీని ఫలితం వెంటనే తెలిసిరాదు స్త్రీజనమే సంసార జీవిత విమోచనం కోరివుండకపోతే పురుషులకు నేను విధించిన నిష్ఠుర నియమాలతో మన యీ ధర్మం యీ దేశంలో వేయి సంవత్సరాలకు మించి నిలచేది ఇప్పుడు నా విధించిన యీ కఠోర నియమాలూ యీ ధర్మమూ కూడా యీ దేశంలో అచిరకాలంలోనే క్షీణింపడానికి కావలసిన అంకురారోపణ జరిగింది తీరమొరసి పారే వెల్లువను ఆపడానికి పదిలమైన గట్టుకట్టినట్లు స్త్రీలకు ఎనిమిది ప్రత్యేక సూత్రాలను విధించానేగాని, వారి రాకడవల్ల ధర్మక్షైణ్యము తప్పదానందా

ఆనం మీరు విధించిన కఠోర నియమాలవల్ల మనధర్మం శాశ్వతముగా సాగగలదనే నా ఆశ భగవన్ ..

శిష్యు ఆనందా, వత్సగోత్రుడగు మునీశ్వరుడు భగవానుని దర్శనాపేక్షతో వాకిట వేచివున్నారు

బుద్ధు ఆనందా రమ్మను

ఆనం మాధురా, వారిని సగౌరవముగా తీసికొనిరా .

వత్స పూజ్య గౌతములకు ప్రణామాలు ... ఒక ధర్మసంశయ నివృత్తికై మీ వద్దకు వచ్చాను సెలవియ్యండి మనుజునిలో అహంకార మనేది ఉన్నదా?

బుద్ధు (నిశ్శబ్దం)

వత్స కనుపించేదల్లా భ్రమ అని తమ ఉపదేశంగదా చెప్పండి మరి ..మనుజునిలో అహంకారమనేది ఉన్నదా...?

బుద్ధ (నిశ్శబ్దం)

వత్స ఈ సంశయం నివృత్తిచేయరా మౌనవ్రతంలో ఉన్నారా

బుద్ధ (నిశ్శబ్దం)

వత్స మరొకసారి కలుసుకొంటాను సెలవు (పరిక్రమణ)

బుద్ధ .. . .. ఆనందా విన్నావా వత్సగోత్రుని ప్రశ్న . ?

ఆనం విన్నాను భగవన్ తామెందులకు ప్రత్యుత్తర మీయలేదు .

బుద్ధ ఆనందా, నేనని ఉంటే, అహంకారం ఉన్నదని చైతన్య సహితమై అనేక వాసనా సంయుతమై నేననీ జీవాత్మ అనీ అనబడే అహం ఉన్నదని నా అభిప్రాయంగా అతడు గ్రహిస్తాడు. అది నా అభిప్రాయంకాదు. ఆ అహం ఆభాసమాత్రమే కాని వాస్తవంకాదు అహంకారం లేదని నేనని ఉంటే మరణానంతరం అంతా శూన్యమే అనే శూన్యవాదిగా నన్ను అర్థం చేసుకుంటాడతడు లోకంలో ఈ రెండువాదాలకు చెందినవారూ ఉన్నారు వారికిగాని వత్సగోత్రునికిగాని, అతడు నన్నడిగిన ఆ ఆభాసమాత్రమైన అహానికి, శాశ్వతమైన జీవాత్మలోని అహానికీగల వ్యత్యాసం అగమ్యగోచరం ఆ ఆభాసమాత్రమైన అహం భౌతిక దేహంతోపాటు నశిస్తుంది వాస్తవమైన శాశ్వత జీవాత్మలోని అహం జన్మజన్మాంతర ప్రయాత- .. ఈ విచక్షణా జ్ఞానంలేక ఆ ఆభాస ప్రపంచమే వాస్తవ మనుకునే వత్సగోత్రునిముందు నేనునిరుత్తరుణ్ణి కావలసి వచ్చింది

మాధు గురుదేవా...పూర్ణముని తమ ఆజ్ఞకై వేచివున్నారు .

బుద్ధ, రమ్మను ...

పూర్ణ నమో వాకం ..

బుద్ధ హింసపరుల రాజ్యానికి వెళ్లి ధర్మోపదేశం చేయుడానికి సిద్ధంగా వున్నావా పూర్ణమునీ ...

పూర్ణ చిత్తం స్వామీ.

బుద్ధ వారు నిన్ను దుర్భాషలాడి నొప్పిస్తే నీ వేలా సహిస్తావు? ఏమని భావిస్తావు?

పూర్ణ వారు చాలా మంచివారు కనుక, నన్ను తిట్టి ఊరుకొ
న్నారు గాని కొట్టలేదని భావిస్తాను స్వామీ ...

బుద్ధ వారు నిన్ను ప్రహరిస్తే ...

పూర్ణ ప్రహరించి ఊరుకున్నారు గాని కత్తులతో పొడవనంత
వరకూ మంచివారే అని భావిస్తాను భగవన్ ...

బుద్ధ ఖడ్గం ప్రయోగిస్తే?

పూర్ణ ప్రాణాలతో వదలినందుకైనా మంచివారేకదా ... అని

బుద్ధ ప్రాణాలు హరిస్తే

పూర్ణ నా శోక మహాభారం తప్పించినందుకు అప్పుడు కూడా
వారుమంచివారే అనిభావిస్తాను స్వామీ .

బుద్ధ పూర్ణా చక్కగా చెప్పావు నీవు విముక్తుడవే, పోయి
విముక్తిమార్గం బోధించు సత్యశాంతిని చూరగొన్న
నీవు వారికి శాంతిమార్గము చూపించు, పోయిరా ...
పూర్ణా నీవూ నీ పరివారమూ ధర్మయోధులు ధర్మ
విజయం సాధించుకొని రండి ...

... ... ...

పురుష బృందగానము

యోధులం మనం యోధులం
యోధులం ధర్మ యోధులం
వినయ సహనయుత భేరి ప్రమోగించి
జ్ఞానకాంతిమన్నారి సారించి
జగత్ప్రణయ చాపమును బిగియించి
శాంతి కలిత సమరమున సాధించు
...యోధులం...

ఉదాత్తభావుకత, పూర్ణసజ్జనత
దివ్యబోధ, నిష్పాప పావనత
అంధలోకమున కక్షిసంపదా
అస్వతంత్ర జగతికి స్వతంత్రతా

శాంతికలిత సమరమున సాధించు
యోధులం మనం యోధులం
యోధులం ధర్మ యోధులం

అహంకార పైశాచ మూర్తులను
ఇహ జగంపు మదలోభ రక్తులను
వ్యథా ప్రచోదక వృథాసక్తులను
హింసా వ్రతవిద్వేష శక్తులను

త్యాగదీక్షతో దృఢ విరక్తితో
నియత దృష్టితో నిర్లిప్తతతో
శాంతి కలిత సమరమున సాధించు
యోధులం మనం యోధులం
యోధులం ధర్మ యోధులం ...

(నిష్క్రమణ)

. . . ..

బుద్ధ ఆనందా ...

ఆనం చిత్తం గురుదేవా ...

బుద్ధ పూర్ణముని రాకకుముందు అహంకారాభాసమును
గురించి వాస్తవాహమును గురించి చెపుతున్నాను నీకు
అవగాహనయిందా ...?

ఆనం పునశ్చరణ చేసుకొంటున్నాను భగవన్ ...

బుద్ధ ఇదే సమస్యపై నీ సచ్ఛాత్రులు యమకునికీ శారిపుత్రునికీ
యీ మధ్యనే వివాదం వచ్చింది

ఆనం సెలవియ్యండి భగవన్ .

బుద్ధ భౌతిక దేహంతోపాటు ఆ జీవికి సంబంధించినదంతా
నశిస్తుందనీ ఆ పైనఏమీ ఉండదనే శూన్యవాద సిద్ధాం
తానికి యమకుడు అనుకూలుడుగా మారాడని విన్నాడు
ఒకనాడు శారిపుత్రుడు

(ఫేడిన్)

శారిపు సోదరా యమకా, సర్వశూన్యవాదం స్వీకరిస్తున్నావని
విన్నాను నిజమేనా . ?

యమక నిజమే శారిపుత్రా...భగవన్ తథాగతుని బోధలకు
అదే పరమార్థమని గ్రహించాను

శారి అయితే శాక్యముని భౌతికకాయానికి ఋషిత్వార్హత
వుందంటావా ... ?

యమ లేదు సోదరా ...



http://www.maganti.org

శారి పోనీ ఆ దేహపు జ్ఞానేంద్రియానుభూతులకు గాని, కర్మేంద్రియచేష్టలకుగాని అవస్థలకుగాని ఋషిత్వం ఆపాదింపగలవా?

యమ ఊహుఁ ... అపాదింపలేను

శారి అయితే భౌతికరూపమూ జ్ఞానేంద్రియానుభూతులూ కర్మేంద్రియ చేష్టలూ అవస్థలూ వీటికి కాక ఆ వ్యక్తిలో మరి దేనికి ఋషిత్వం అపాదింపగలవో చెప్పగలవా?

యమ చెప్పలేను.

శారి అవన్నీ చేరిన సమాహారం ఋషిత్వం అవుతుందంటావా?

యమ ఉహు!

శారి దృశ్యమానములైన భౌతిక రూపాలతో నిండివున్న యీ ప్రపంచంలో ఋషిత్వముదేనికో రుజువు చేయలేని వాడవు, మరణానంతరం ఆ ఋషికూడా నశిస్తాడనే సర్వశూన్యవాదాన్ని ఎలా సమర్థించగలవు చెప్పు యమకా ... ?

యమ శారిపుత్రా ... నా అజ్ఞానాన్ని క్షమించు, గురుబోధలోని యదార్థాన్ని నీవే నిరూపించు .

శారి విను సోదరా ... ఇంద్రియాను భూతులూ, చేష్టలూ, అవస్థలూ చైతన్యమూ ఇవన్నీ ఆత్మాభాసములే .. వీటికంటే వేరుగానే ఉంటుంది వాస్తవమైన జీవాత్మ, ఋషిత్వం పొందిన వ్యక్తితన జీవితంలోనే యీ అవస్థాద్యనుభూతులు తానే అనే అహంకారానికి అతీతుడు కాగలడు. భౌతికకాయం నశించినపుడు దాని మెదడుతో పాటు ఆత్మాభాసములైన అవస్థాద్యనుభూతులకు నాశం ఉంటుంది కాని, విశ్వజనీనమైన ప్రధాన జీవాత్మ నశిస్తుందనుకోవడం ఎలాగ? అది సత్యం కాదు ..

యమ గురుదేవుని బోధల ప్రకారం బోధిసత్త్వుడనిపించుకొనే ఋషిమరణానంతరం కూడా అస్తిత్వం కలిగఉంటాడా

శారి సోదరా...గురుదేవు లావిధంగా ఎన్నడూ చెప్పలేదు

యమ అయితే అస్తిత్వం కలిగిఉండడా ... ?

శారి. ఆ విధంగానూ చెప్పలేదు ...

యమ అస్తిత్వం ఉండీ లేకుండా ఉండడం ఎలా పొసగుతుంది శారిపుత్రా ?

శారి యమకా, గంగా నదిలోన్ని ఇసుక రేణువులను ప్రగణకుడైనా లెక్కపెట్టగలడంటావా?

యమ అసాధ్యం

శారి పోనీ సముద్రంలోని జల బిందువులను లెక్కపెట్టడం?

యమ దుస్తరం

శారి ఎందుకనుకున్నావు? సముద్రం అగాధం మహాగభీరం అమేయం, అపరిమితం, అలాగే బోధిసత్వులైన ఋషులనిపించుకొన్న మానవోత్తముల అస్తిత్వాన్ని మానవ సామాన్య ప్రమాణాలతో ఋజువు చెయ్యలేం.. అట్టి మహాత్ముల భౌతిక రూపానికి సంబంధించిన సిద్ధాంతాలన్నీ వ్యర్థం మహాగభీరుడై సాగరంవలె అమేయ ప్రమాణుడై ప్రాపంచిక దృష్టిలోని అస్తిత్వనాస్తిత్వ శంకలకు అట్టి మహాత్ముడు అతీతుడై ఉంటాడు

(స్త్రీ) బృందగానం

అది అమేయ మది యగాధమగు మహాత్మతా
అస్తినాస్తి విచికిత్సా నిస్తులాత్మతా ॥అది అమేయ॥
జన్మపరంపరల పుణ్యకర్మల పెరిగే
ఉత్తరోత్తరమగు జన్మ లొదవుట నెరిగే ॥అది అమేయ॥
మహాబోధి సత్త్వుడగుట మనుజమాత్రుడే...
మహర్షి మానవోత్తముడు మనుజ ప్రియుడే
॥అది అమేయ॥

ఆనం మాలుక్యా . ఆగు, ఆగు, నే చెప్పిన మాట విను, గురువర్యుని ఆ ప్రశ్న అడుగవద్దు

మాలు నన్నాపకు ఆనందా నే నడిగి తీరుతాను భగవాన్ ముందు నా సందేహాలు తీర్చండి జగద్విఖ్యాతుడైన బోధిసత్త్వుడు మరణానంతరం అస్తిత్వం కలవాడేనా? జగత్తు శాశ్వతమా కాలపరిమితమా? దయచేసి యీ ప్రశ్నలకు సమాధాన మియ్యండి, భగవాన్ తెలియక పోతే తెలియదని స్పష్టంగా చెప్పివెయ్యండి...

ఆనం, మాలుక్యా! ఎంతటి అవినయం.. వద్దని నే . .

బుద్ధు, ఆనందా .. అడుగనీ . మాలుక్యా! సావధానుడవై నే నడిగేది విను నీకు జగత్తు శాశ్వతమో అనంతమో జీవచైతన్యం భౌతికకాయం కంటే వేరైనదో లేక

రెండూ ఒకటేనా — బోధిసత్త్వుడు మరణానంతరం కూడా జీవిస్తాడో లేదో—యీ విషయాలన్నీ బోధిస్తాను రావయ్యా అని వాగ్దానంచేసి అందుకే నా శిష్యుడవు కమ్మని రమ్మని పిలిచానా చెప్పు—

మాలు, లేదు భగవాన్—లేదు—

బుద్దు విషదిగ్ధమైన బాణం తగిలి గాయపడిన నా గాయాన్ని మాన్పవద్దు—ముందు నన్ను బాణంతో కొట్టిన దెవరో తెలిసికోనీండి అని అడిగితే వాడు ఉత్తముడా అధముడా—

మాలు అధముడే—

బుద్దు ఇంకా ఆ బాణంతో కొట్టినవాడు పొట్టా పొడుగా వాని బాణాలు ధనస్సు ఏ మూల పదార్థంతో చేశారో అని యీ విధమైన జిజ్ఞాసచేస్తూ ఉంటే వాడే మవుతాడు?

మాలు వృధాకాలయాపనమయి విషంవల్ల వాడు మరణిస్తాడు—

బుద్దు అదే విధంగా మీకు కలిగిన ధర్మసంశయాల చర్చలవల్ల వృధాకాలయాపనమయి, జీవిత కాలం పూర్తయిపోతుంది వాటి పరిజ్ఞానంవల్ల పావనత్వంకాని నిర్లిప్తత కాని శాంతీ మనోవికాసమూ కాని కలుగవు అందుకే బాధాజాలపు వాస్తవ స్వరూపము, దాని కారణమూ దానినుంచి తప్పించుకొనే మార్గమూ వీటినే నేను బోధిస్తున్నాను నేను బోధింపని విషయాల జోలికిపోవద్దు బోధించిన వాటినే అనుసరించండి—

మాలు గురుదేవా క్షమించండి ఎన్నడూ ఇటువంటి సందేహాల జోలికి పోము

(సంగీత విరామం)

ఆనం భగవన్—వశిష్టవేదాంతి తమ దర్శనాన్ని అపేక్షిస్తున్నారు

బుద్ధ రానీ—స్వాగతం వశిష్టమునీ—

వశి నమోవాకం గౌతమమునీ—

బుద్ధ ఆసనం అలంకరించండి—

వశి అద్వితీయ విజ్ఞానవంతమైన మీ మేధాశక్తి నన్ను జేతవనానికి తిరిగి రప్పించింది

బుద్ధ మీ సహృదయతే మిమ్మల్ని తిరిగి రప్పించింది

వశి గౌతమా, జీవాత్మ విశ్వరూపియైన పరమాత్మతో ఐక్యమొందే స్థితి మా వల్ల తెల్లమవుతుందని విన్నాను మీ ముఖతః విని ధన్యుణ్ణి కాగోరుతున్నాను

బుద్ధ వశిష్టా, పరిపూర్ణజ్ఞానియై, సత్యస్వరూప మెరిగిన ఆనంద మూర్తియైన బోధిసత్త్వుడు తడవ తడవకు ప్రపంచంలో జన్మలెత్తి బుద్ధత్వము పొందినందువలన విశ్వమును గురించిన సర్వజ్ఞానమూ కరతలామలకముగా తెలిసినవాడవుతాడు ఇంద్రియానుభూతులవల్ల కలిగే భ్రమావరణం అతన్ని బాధించదు సామాన్య మానవులకు మాత్రం వారి భావనా సంసారం ఒక మిధ్యా ప్రపంచం ఏర్పడి వారు అంధులై దాన్నే విశ్వసిస్తారు బోధిసత్త్వులైనవారు యీ భ్రమావరణాతీతులు గనుక వాస్తవ రూపమును చూడగలిగి సృష్టి స్థితి లయములలో సౌందర్యసమన్వితమయి, సర్వ వ్యాప్తియైన విశ్వాత్మ స్వరూపమును దర్శింపగలుగుతారు పావనత్వంవల్లను పరిపూర్ణతవల్లను జ్ఞానమనిపించుకొన్న ఆదర్శ జీవన పథానువర్తులైన వారికే ఇది తెలుస్తుంది.

వశి సెలవివ్వండి భగవన్—వింటున్నాను

బుద్ధ ఈ ఆదర్శ జీవన పథం రెండు తెరగులు ఒకటి యతులైన వారికి ఇంకొకటి గృహస్థులకు ఆపథానువర్తియైనాడు ఆంతరికంగా బాహిరంగా సత్ప్రవర్తన సాధించి తన మనస్సును పంజరం నుంచి తీసిన పిట్టనువలె ప్రేమతో కరుణతో లోకం నాలుగు మూలలకూ వ్యాప్తింపజేస్తాడు మహావైతాళికుని శంఖం లోకం అన్ని మూలలా ప్రతిధ్వనిస్తుంది అతడు నిర్లక్ష్యముచేసే ప్రాణి ఒక్కటీ ఉండదు జీవకోటి నంతనూ తన అమేయ ప్రణయంతో అవరిస్తాడాతడు ఆ అమేయ ప్రణయం సాధింపగలిగిన నాడు ఆ స్థితే విశ్వరూపియైన పరమాత్మకు అత్యంత సన్నిహితము తన ఆత్మజ్యోతి పరమాత్మ జ్యోతితో కలియడానికిదే మార్గం.

వశి ధన్యోస్మి భగవన్—మీ జ్యోతిరైక్య కధనంవల్ల నా అజ్ఞానాంధకారం పటాపంచలయింది బుద్ధం శరణంగచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి

బృందగీతి విన్నావటోయి యీ విజ్ఞాన గీతి
కన్నావటోయీ కాంతి ప్రసూతి
అజ్ఞానులకు దూరమై యుండవోయి
విజ్ఞానులను గౌరవింపంగదోయి
ప్రాగ్జన్మ సుకృతుల పాటింపవోయి
సజ్జనావళి మైత్రి సలుపంగదోయి
వీనుల కన్నుల విప్పారనిమ్ము
సద్వృత్తి సద్భావ జ్ఞానమ్ము కొనుము
జననీ జనకులకు సలుపు పూజనము
దార సుతులకిమ్ము తగిన రక్షణము
దానాలు చేయుముదార ప్రసిద్ధి
బంధుమిత్రులకు తోడ్పడు ధర్మబుద్ధి
సర్వథా పాపమ్ము సలుపగాబోకు
పుణ్యకార్యమ్ముల పొల్లుగా నీకు
విజ్ఞుల సన్నిధి వినయమే భూష
జిజ్ఞాస సంతృప్తి చిరధర్మ ఘోష
ఓరిమి తాలిమి ఉత్తమ గోష్ఠి
సాధు స్వభావమ్ము శమదమ నిష్ఠ
ఆనందమయముగా అఖిలమ్ము కనుము
నిత్యశాంతి జ్యోతి నీలోని గనుము .

విరామం

బుద్ధ, పాడిపశువులతో కలకల్లాడుతున్న యీ పచ్చని పైరుచేను తృప్తికీ ఆనందానికీ నెలవు ఏ పుణ్యమూర్తి ఈ పంటకు నోచుకున్నాడో మాధురా

మాధు భగవన్ యీ పొలాలు ధనియా అనే గోపాలకుడివి. నిత్య సత్కార్మపరుడై దయాళువు నిరాడంబరుడు అయిన ఇతడు భగవానునకు అత్యంత ప్రియతముడై అంతేవాసి కాదగినవాడు,

బుద్ధ ఆ వచ్చే అతనేనా?

మాధు; అవును స్వామీ , .

ధనియా మహాపురుష, స్వాగతం నా పురాకృత పుణ్యం రూపుతాల్చిన పురుషోత్తముడవు నీకు స్వాగతం, మా కృషి క్షేత్రాన భాగ్యవర్షం కురిపించే వరుణదేవుడవు నీవేనా ? రండి రండి వరుణదేవుడికి గీతాంజలి అర్పిద్దాము

ధనియా బృందము
అన్నాలు వండాము అందరికీ పెట్టాము
ఆవుల్ని పిదికాము దూడలకు వదిలాము
మాహీతీరంలోన మా క్షేత్రమున్నది
వరుణ దేవా వానకురవావయ్యా ..

బుద్ధ
లేవు శరమును క్రోధమ్ము లేశమేని
ఒక్క రాత్రి మాహీనది యొడ్డునందు
విడిసితిని, లేదు స్వగృహ మార్పితిమదాగ్ని
ఇచ్ఛగించితే వరుణి వర్షింపుమింక

ధనియా బృందం
పచ్చని పైరుచేల పశువులు పొరాడుతాయ్
వాకిట గాదెల్లో వడ్లూ పొర్లాడుతాయ్
కల్లా కపటంలేని యిల్లాలూ పిల్లలూ
ఇష్టానువర్తులూ ఇంటీ దీపాలూ
వరుణదేవా వానకురువావయ్యా. . .

బుద్ధ
ఆత్మ సంబుద్ది తరణిగా అందుకొంటి
శాంతితీర మాశాతృషా జలధి గడచి
ఇల్లు రాజ్యమ్ము ఇల్లాలినెల్ల వదలి
ఎల్లలేని లోకమ్మెల్ల ఏల చనితి
ఇచ్ఛగించితే వరుణ వర్షింపు మింక

ధనియాబృందం
కోటి పరివారంతో కూడిన క్షేత్రమ్ములూ
కొట్లాలో పదిలంగా కట్టిన మా సొమ్ములూ
నా పూర్వ పుణ్యమునా నా యింటి కెందరో
అతిథులూ వస్తారూ ఆనందిస్తారూ
వరుణదేవా వానకురువా వయ్యా

బుద్ధ

పలుపుత్రాడు త్రెంచిన వృషభమ్ము వోలె
వ్యూహా పుటభేదనము సేయనోపు మత్త
గజమువలె జన్మజాలపు గట్టి త్రాళ్లు
ముడి ముడకి త్రుంచివైచి విముక్తుడైతి
ఇచ్ఛగించితే వరుణ వర్షింపు మింక

గాలీ వర్షమూ ధ్వనులూ

ధని ధన్యోస్మి భగవన్ తథాగతా ధన్యోస్మి మీ దివ్యదర్శనం వల్ల మా జన్మలు పావనమైనాయి మహానుభావా మాకు గురువులై ఉపదేశం చెయ్యండి మనస్సుకు బాధ్యతలులేని ప్రశాంతి ఎలా గలుగుతుందో సెలవియ్యండి

బుద్ధ నాయనా పశు సంపద కలవానికి వాటి పోషణ గురించి తాపత్రయం ఉంటుంది సంపదలనుంచి బాధ్యతలనుంచి విముక్తుడైనవాడు స్వేచ్ఛాజీవి ఆ శాంతపరిస్థితియే నిర్వాణం

ధని చెప్పండి వింటున్నాను మీరు నిర్వాణ సిద్ధిపొందారని విన్నాము అది యెటువంటిదో సెలవియ్యండి

బుద్ధ ధనియా, విను సామాన్యంగా అజ్ఞులైనవారు నిర్వాణ మంటే మృతి అని భావిస్తారు కాని అది సరికాదు

నిజమైన నిర్వాణము ఇది నిత్య జీవితంలో నిత్యాభాసములుగా అనిపించే కోరికలు, ఆశలు, ఈర్ష్యాసూయాది భావాలతో కూడిన అహం అంతర్హితం కావడమే నిర్వాణం ఆ ఆభాసరూపమైన వ్యక్తిగతాత్మ భౌతిక దేహ విచ్ఛిత్తి కాకుండానే విశ్వాత్మగా పరిణామం పొందడమే నిర్వాణం అన్నమాట

ఇది సజీవుడై ఉండగానే సాధించే అమరత్వం యీ స్థితి పొందినవారికి జన్మ జరా మరణ దుఃఖములులేవు అట్టివారి ఆత్మ శాశ్వతమై లోకమునంతనూ ఆవరించ గలదు.

స్త్రీ పురుష బృందగానం

అందరూ

లేదు జన్మదుఃఖం రాదు జరా దుఃఖం
నీ దయచే మాకు కలుగ దింక మరణ దుఃఖం.

ఒక గొంతు

బ్రదుకను సెలయేటి నీట పదము లంట నిలిచి
మానసాశ్వమునకు వేగయానము నలవరచి
నా గుహాంతరాళమునకు ఏగుదు నోః దివ్వెతో
కించపడక దివ్వె నూనె ముంచివైతు నవ్వుతో

ఇంకొకడు

చిన్ని వెలుగు దీపమ్మది పెద్దది అగుచే
ఉన్న ఆత్మ వాస్తవ రూపము నెరుంగుచే
ఉన్న ఆత్మ స్వేచ్ఛాపద మొందును తానే
చిన్ని దివ్వె నిర్వాణము చెందుటతోనే

మరొక గొంతు

రక్త మాంసముల పరుగులు రిత్తవోవగా
అహంకార భావమ్మది అంతరింపగా
జన్మ పరంపర నిలిచే జ్ఞానముతోనే
జ్యోతిరైక్య పరినిర్మాణమ్మగు తానే
లేదు జన్మ దుఃఖం రాదు జరా దుఃఖం
నీ దయచే మాకు కలుగ దింక మరణదుఃఖం

ఆనం ఆత్రంతో – గురుదేవా, భిక్షకు బైలుదేరి నా కన్నుల ముందు నడిచేవారు వెనకబడి పోయా రీవేళ, ఏదో శారీరక బాధ-ఆజ్ఞాపించండి ఏం సేవచేయను

బుద్ధ (నీరసమైన నవ్వు) ఆనందా ఏమీ లేదు. ఇదేమీకాదు

ఆనం వేలువనంలో యీ వర్షాకాల నివాసం మీ శరీరానికి ఆయాసం కలిగించింది. నాకు తెలుస్తోంది

బుద్ధ ఆనందా, సహించుకోవాలి నువ్వూ సహించుకోవాలి. మానసిక శక్తిద్వారా శారీరక అశక్తిని లొంగదీసుకోవాలి

ఆనం నేను కళ్ళారా చూశాను భగవన్ మీ మానసిక శారీరక శక్తుల సంఘర్షణను చూస్తూనే ఉన్నాను మీ యీ

బాధను చూసి, నా ఒళ్లు తీగలా వణికిపోయింది కాని తగిన సమయం చూసుకొని, సంఘ శ్రమణుల నందరినీ పిలిపించి వారి వారి విధులను మీరే ఆనతిస్తారని ఆశిస్తున్నాను నేనే కాదు.

బుద్ధ అదేమి ఆనందా బౌద్ధ సంఘం నా ఆజ్ఞలకోసం ఎదురు చూడాలా ఇంకా? ఊఁహుఁ, యీ సంఘానికి తాను నాయకుడనిగాని మార్గదర్శి అనిగాని సంఘం తనపైనే ఆధారపడి ఉండాలనిగాని ఆశించడం వివేకంకాదు జ్ఞాని ఆ విధంగా యోచింపడు నా శరీరానికి వార్ధక్యం వచ్చింది వయస్సు పైబడింది నా యాత్ర తుది ఘట్టానికి వస్తోంది ఇప్పటి యీ యాత్ర ప్రారంభమై ఎనుబది ఏండ్లు కావస్తోంది భౌతిక విషయాలపై చింతలు మాని, కీళ్లు సడలిన యీ శకటాన్ని జాగ్రత్తగా నడుపుకోవాలి,

ఆనం, భగవన్, మీ మాటలు వింటుంటే నాలో చీకటికమ్ముతూ వెలుగు చిమ్ముతూ తిరిగి చీకటి కమ్ముతోంది చీకటి కావల ఏముందో చూడడానికి భయం కలుగుతోంది.

బుద్ధ ఆనందా. ప్రాజ్ఞత నిలబెట్టుకో. బౌద్ధ సంఘంలోని మీరంతా మీ వెలుగు మీరే కావాలి నిన్ను తప్పించి వేరే ఎవనినీ శరణు వేడకు దృఢమైన ఆత్మవిశ్వాసం అవసరం. నా అనంతరం వేరెవ్వరినీ ఆశ్రయింపక తనకు తానే జ్యోతిర్మూర్తియై, సత్యదర్శి కాగలిగిన వాడు ఉత్తమ గతి పొంద గలుగు తాడు. నా భిక్షాపాత్ర ఇటు తే ...

ఆనంద ఇదిగో పాత్ర .. ఇదిగో ఉత్తరీయం ...

బుద్ధ ఇప్పుడు వైశాలి నగరంలో భిక్షాటనం ... సాయంత్రం కపిలకేతియానికి వెడదాం ...

(విరామ సంగీతం)

బుద్ధ బోధిసత్వ సిద్ధులు పొందిన జీవి ... లోకోపకారాని కావశ్యకమైతే మరొక జన్మలో గడప వలసిన వ్యవధిని కూడా కలుపుకొని తన అయుర్దాయాన్ని పొడిగించుకోవచ్చు విన్నావా ఆనందా ...

ఆనం ( తనలో ) భగవానుని భౌతిక కాయం కృశించిపోతోంది నా నాటికి మానసిక శక్తులు ఉంటవో ఉడుగుతవో ఊహ కందడం లేదు ...

బుద్ధ ఆత్మవిశ్వాసంతో బోధి సత్వాంశ గల జీవి ఇచ్ఛగిస్తే మరొకజన్మలోని ఆయుఃపరిమితిని ఈ జన్మలోనే పెంచుకోవచ్చు ... విన్నావా ఆనందా ...

ఆనం (తనలో) గురుదేవు లేమేమో అంటున్నారు ... ఆయన మమ్మల్ని విడిచి వెళ్ళి పోతారేమో అనే భయం తప్ప ఆయన అనేదేమీ నా మనస్సు కెక్కడం లేదు

బుద్ధ ఆనందా ... నీవు కొంచెంసేపావలికి వెళ్లు ...

(మారాగమన సంగీతం)

మారుడు భగవన్ ... దయ చేయాలి .. జీవితం నుంచింక నిష్క్రమించాలి ... బౌద్ధసంఘం స్థాపించి యతులకూ గృహస్థులకూ సత్యబోధ చేసిన వెనుక నిష్క్రమిస్తానని చేసిన వాగ్దానం మరవవద్దు అన్నీ జరిగాయి ... సమయం ఆసన్న మయింది. దయచేయాలి ప్రభూ ...

బుద్ధ మారా ... సంతోషించు ... మూడుమాసాలు కాగానే నీ కోర్కె నెరవేరుతుంది ...

(భూకంప సంగీతం)

ఆనంద (సంభ్రమంతో) భగవన్ ... భగవన్ ఏమిటీ విపరీత భూకంపం ... ?

బుద్ధ నిర్వాణ మందిన బోధిసత్త్వుడు అప్రతర్కితంగా తన ఆయుఃపరిమితి ముగించుకొనే నిశ్చయానికి వచ్చినప్పుడిలాటి విపరీతాలు జరుగవచ్చు ...

ఆనం ఆఁ ... ఏమంటున్నారు భగవన్ ...

బుద్ధ ఆనందా ఇక మూడు మాసాలు గడువు ఆపైని నీకీ కంఠం వినబడదు

ఆనం భగవన్ ... ఏమిటీ నిర్ణయం, శిష్యగణం, మానవ లోకం, బోధిసత్వ పరంపర ... వీరందరి సంక్షేమం కోసం మీ ఆయుర్దాయం పెంచండి మహానుభావా ...

బుద్ధ సమయం మించిం దానందా ...

ఆనం అయ్యో గురుదేవా ... మీరులేనిదే లోకం అంధకార మయమై పోతుంది మీమహిమ గ్రహింపలేకపోయాను ముందుగా కోరుకోలేదు నా అజ్ఞత మన్నించండి మీ జీవితపరిమితి పెంచండి

బుద సర్వార్థ సిద్ధి వచనానికి తిరుగులే దానందా ... లే ... మహావనానికి వెడదాం ... వైశాలి నగరం చుట్టు ప్రక్కల యతులను గృహస్థులను అందరనూ అక్కడకు పిలుచుకొనిరా (విరామ సంగీతం) (శరణత్రయం) శ్రమణ సోదరులారా .. పాంచభౌతిక పదార్థా లన్నిటికీ జరా మృతీతప్పదు .. అజరామరమైన మోక్షానికి మీరంతా అర్హులు కావాలంటే యీ జరామృతుల వలననూ జీవితంలో ప్రలోభాల వల్లనూ కలిగే దుఃఖానికి అతీతులు కండి అదే నిర్వాణం ఇక మూడు మాసాలకు యీ కంఠం మీరువినరు దృఢ సంకల్పులై మీ మనస్సులను అదుపులో ఉంచుకోండి ధర్మాన్ని అనుసరించి దుఃఖకారణాలను నిర్మూలించండి ఉత్తమ వర్తన, ఉత్తమ ధ్యానం, ఉత్తమ జ్ఞానం, ఉత్తమస్వేచ్ఛ వీటిని ఆచరణలో వుంచుకొని జీవిత వాంఛలను మూలచ్ఛేదం కావించుకొంటే జన్మరాహిత్యం లభిస్తుంది ..

(సంగీత విరామం) (మూడునెలలయాక)

చుండుడు ఆనందా ... భగవన్ తథాగతులకు నా విన్నపం మనవి చెయ్యరూ .

ఆనం చుండా . . నీవే విన్నవించుకో ...

బుద్ధ ఏమది చుండా ...

చుండు మహాత్మా .. శ్రమణ సోదరులతోసహా తాము మా గృహాన్ని పావనంచేసి భిక్ష స్వీకరించాలి ...

బుద్ధ అవును ... స్వీకరించాలి ... అలాగేకానీ ... (సంగీత విరామం)

ఆనం భగవన్ .. కుశినగరానికి ఇంకా క్రోశం దూరం ఉంది. మీరు వెనుకపడు తున్నారు ఇక్కడాగుదామా ...

బుద్ధ శాలువను మడిచి యీ చెట్టుక్రింద పరు ఆనందా... కొంచెం విశ్రాంతి కావాలి

ఆనం, దయచెయ్యండి ..విశ్రమించండి

బుద్ధ ఆనందా . దప్పికవుతోంది ..మంచి తీర్థం కావాలి...

ఆనం స్వామీ . ఇప్పుడే యీ యేటిలో ఐదు వందల బళ్ళు వెళ్ళాయి నీ రంతా కదిలి బురదగా ఉంది నీరు తేరుకొన్నాక తేనా .

బుద్ధ ఉహు .ఇప్పుడే ఇదిగో కమండలువు తీసుకురా ..

(నీటి చప్పుడు)

ఆనం ఆశ్చర్యం అవతార మూర్తి దప్పిక తీర్చడానికి యీ నదిలో నీరు వెంటనే తేరుకొంది భగవన్ మీరు మహా మహిమాన్వితులు ..ఇదిగో స్వచ్ఛమైన తీర్థం త్రాగండి.

(విరామ సంగీతము)

బుద్ధ (దగ్గుతూ) ఆనందా కుందకా, ఆగండి ఇక్కడ యీ రసాలం దగ్గర కాస్త విశ్రమిద్దాం ..

ఆనం ఆ చుండుని ఇంటి విందుకు తర్వాత నానాటికి మీ శరీరం మరీ అవశం అయిపోతోంది గురుదేవా

బుద్ధ, చూడు ఆనందా, అలాగనవద్దు ఇప్పుడే కాదు, నువ్వే కాదు, నా అనంతరం నా శిష్యులెవరూ కూడా చుండుని అలాగనవద్దు ఇలా మాత్రం అనండి అతడు బోధిసత్త్వానికి అతిథ్యం ఇచ్చినందుకు అతనికి సత్కర్మఫలము మోక్ష సామ్రాజ్యం లభిస్తుందని నామాటగా చెప్పండి లేవండి వెడదాం

ఆనం సెలవివ్వండి గురుదేవా .

బుద్ధ కుశినరంలోని మల్లవంశీయుల సాలవనానికి పదండి. చూడు నందా, ఈ రాత్రి అక్కడి సాలవృక్షద్వయానికి నడుమ నాకు శయ్య ఏర్పాటు చెయ్యి .

ఆనం గురుదేవా ఇది నిజంగా చివరి రాత్రేనా . (గద్గదికతో)

బుద్ధ అవును ఆనందా . ప్రాణోత్క్రమణకు తరువాత యీ భౌతిక కాయానికి గౌరవాలుచేస్తూ మీరు కాలయాపన చేయకండి. మల్లగణంవచ్చి దానికి కావలసిన అపర క్రియలు చేస్తారు .. ఏడీ—ఆనందా...

ఆనం (విలపిస్తూ) మీ వంటి కరుణాసముద్రుడైన గురుదేవు డస్తమిస్తూంటే నేనింకా పరిపూర్ణత పొందని విద్యా

ర్థిగా మాత్రం ఉండిపోయాను యీ ప్రపంచం అంధకారమై పోతుంది మీరే అస్తమిస్తే అయ్యో ..
(బారుమిని విలపిస్తాడు)

బుద్ధ కుందకా మాధురా.. ఏడీ ఆనందు డేడీ ..?

మాధు ఆనందా రావోయి భగవన్ పిలుస్తున్నారు .

వశిష్ఠ సోదరా ఆనందా ఏమిటిది ఊరడిల్లు భగవాన్‌కు తెలిస్తే మందలిస్తారు

బుద్ధ ఆనందా .

ఆనం అయ్యా ..

బుద్ధ చాలు . నువ్వలా బాధపడవద్దు విచారింపకు నాయనా ఎన్నిసార్లు చెప్పానో జ్ఞాపకం లేదూ అత్యంత ప్రియములు సన్నిహితములూ అయిన వాటినుండి దూరంగా పోవడం నేర్చుకోవాలని దారపుత్రులు, తలిదండ్రులు, సోదరులు, గురుశిష్యులు ఎవరికైనా వియోగం తప్పదు ఒక వస్తువు నశింపక తప్పనిసరి అయినప్పుడు దాని అంతాన్ని ఆపడం సాధ్యమా ఆనందా నువ్వు చాల కాలం నాకు సన్నిహిత సహచరుడవై అనురాగంతో దయతో చాలా మంచి సేవ చేశావు మనోవాక్కాయ కర్మలచే నా యందు అనురక్తుడవై ఉన్నావు ఎప్పుడో ఒకప్పుడు నీ ముక్తిని నిశ్చింతగా సాధించకోవలసిన వాడవు కాదూ . శ్రమణ సోదరులారా ఆనందుడు నిశ్శబ్దంగా ఉన్నప్పటికంటే నిత్యమూ బోధిస్తున్నప్పుడూ పరిస్తున్నప్పుడూ సంఘానికి ఆనందదాయకుడని మీకు తెలుసు...నాకూ తెలుసు ఆనందు డిప్పుడు పట్నం లోకి వెళ్ళి మల్లులను పిల్చుకొని వస్తాడు .

(సంగీత విరామము)

బుద్ధ వాణి

ప్రాకృతం సహి వేరేన వేరాని సమ్మన్తీధ కుదాచనం
అవేరేన చ సమ్మన్తి ఏ సధమ్మో సనన్తన ..

(తెలుగు) పగచేత నేనాడు పగ తీర్పలేము,
మైత్రిచే సాధ్యము, మాన్య ధర్మమిది .

ప్రాకృతం సాధు సంబహులా ఇతీ అపిరుక్ఖా అరఞ్ఞజా
వాతో వహతి ఏకరం బ్రహంతంపి వనస్పతిం

(తెలుగు) సహజీవనము మేలు బహుళ జాతులకు
పెనుగాలి వనతరులను కూల్చలేదు...

ప్రాకృతం మాతా పేత్తి భరం జంతుం కులం
జేట్ఠాపచాయినం
సణ్హం సఖిల సంభాసం పేసుణ్ణేయ్యప్పహాయినం
మచ్ఛేర వినయే యుత్తం సచ్చం కోధాభిభుంనరం
తం వే దేవా తావతింసా ఆహు సప్పురిసో

(తెలుగు) జ్యేష్టోపచారము, ఇష్టమృదూక్తి
తలిదండ్రులకు సేవ
సలిపెడివాడు పరుషోక్తి లేని మత్సర బుద్ధి కాని
వినయుడు ఋతభాషి విగత కోపుడును
అగు సత్పురుషు మెత్తు రమరులుకూడ

ప్రాకృతం నతం జితం సాధు జితం యంజితం అవజీయతి
తం ఖోజితం సాధు జితం యంజితం నావజీయతి
యో సహస్సం సహస్సేన సంగామే మాను సేజినే
ఏతం చ జెయ్య మత్తానం న వే సంగామజుత్తమో.

శిష్యులు —

నమోభగవతో అరహాతస్సమ్మా సంబుద్ధస్స

బుద్ధ ఆనందా, మీలో కొందరు తథాగతు డంతరించాడు. కనుక మనకింక గురువు లేడని అనుకోవచ్చు కాని అది సరి కాదు ధర్మమూ సంఘ నియమాలు సత్యాలూ నా అనంతరం అవే మీ గురువులు మీ మార్గదర్శులు

(శరణ త్రయము)

బుద్ధ సోదరులారా, బుద్ధుడేమిటి? ధర్మ మేమిటి? ధర్మమార్గ మేమిటి? - అని ఈ విషయాలలో ఏమైనా సందేహాలుండిపోయి అయ్యో తథాగతుని సమ్ముఖాన ఉండీ ఈ సందేహాలు తీర్చుకొన్నాముగామే అని తర్వాత చింతింప వద్దు ఏమైన ఉంటే అడగండి ..గురుభక్తి వలన అడగటానికి మోమాటమైతే మీలో మీరు చెప్పుకోండి

ఆనం ఇక్కడ సమావేశమైన శ్రమణ సంఘంలో అటువంటి సందేహా లున్నవారు ఒక్కరూ లేరని సగర్వంగా చెప్పగలను గురుదేవా—

బుద్ధ నీ పలుకుల వెనుక విశ్వాసం నాకు తెలుసానందా
ఆ విషయం నాకూ ముందుగానే తెలుసు మీ రందరూ
బాధా విదూరులై శాశ్వత శాంతిపొందగలవారే,
శాశ్వత శాంతి! సోదర లోకం వినండి, పాంచభౌతిక
మైన జీవపదార్థాలన్నిటికీ నాశం తప్పదు మమత విడ
నాడి మీ మోక్షానికై మీరు కృషిచెయ్యండి...శాశ్వత
శాంతికై .

వశిష్ఠ భగవన్ భగవన్ ఇది వైశాఖ పూర్ణిమ, ఇది మీరు
జన్మించిన శుభదినం మీరు నిర్వాణము నందిన పావన
దినం ఈనాడు మహాపరినిర్వాణమందు పవిత్ర దినం
కూడాను

ఆనం భగవన్ ..భగవన్...భగవన్!...
వైశాఖ పూర్ణిమా వర్ధిత జ్యోతి
నిర్వాణ పథమందు నిస్తుల జ్యోతి
విశ్వమ్ము నంతటి వెలిగించు జ్యోతి
ఈశ్వరత్వమ్మంది భాస్వంత మాయె

బృందగానం
నిత్యమైనది సత్యమైనది నిస్తులాత్మ జ్యోతి ఒకటే
భువనమంతట వెలిగే తాపస పూర్ణిమా మధుర ప్రశాంతి
ఇంద్రియపు చెరసాల గోడలు ఎదుగుటకు కారణమ్మెవరో
జన్మపై జన్మల పరంపర సాగుటకు కారణమ్మెవరో
ఆశలను స్వప్నాల వలలను పన్ని విరజిమ్మినది యెవరో
అసద్రూప పుటహారికారమె ఆత్మ యనిపించినది యెవరో...

సురిగ తన ఆత్మావభాసం
వెలిగెను సదాత్మ ప్రకాశం ॥నిత్యమైనది॥
కాలావకాశాల వేలలు కరగిపోయిన చిదానందం
కాంతి శబ్దావసానమ్ములు కదలిపోయిన బృహదనంతం
ప్రణయపారావార మనుభవసారమౌ కరుణార్ద్రి చేతం
పారహీన వృథావ్యథాంబుధి ప్రశాంత విరామ గీతం
వెలిగెను సదాత్మ ప్రకాశం
సురిగె తన ఆత్మావభాసం ॥నిత్యమైనది సత్యమైనది॥



Source: A.P. Press Academy Website, Natya Kala - Dec 1963

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan